క్లుప్తంగా

పశువైద్యాధికారిగా సౌందర్య



కడెం: మండల పశువైద్యాధి కారిగా పడిగేల సౌందర్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పశువైద్యాధికారిగా పని చేసిన విజయ్ బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో సౌందర్యను కడెం పశువైద్యాధికారిగా నియమించారు.

హరిహర క్షేత్రంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట ఆలయంలో మంగళవారం గణపతి, సుబ్రహ్మణ్య స్వాములను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ–మురళీధర్‌రెడ్డి దంపతులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

బాధిత కుటుంబానికి సాయం

సారంగపూర్: మండలంలోని సారంగాపూర్ గ్రామానికి చెందిన పాత్రికేయుడు ఎనుగంటి రాంచందర్‌గౌడ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో దాతలు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం ఇజ్రాయెల్ తెలంగాణ అసోసియేషన్ వారు రూ.2.80లక్షలను నిజామాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లి బాధితుడి భార్య సింధూకు అందజేశారు. రాంచందర్‌గౌడ్ బంధువు కరుణాకర్ గౌడ్ ఇజ్రాయెల్‌లో తెలంగాణ అసోసియేషన్ వారికి ఈ విషయం తెలుపడంతో ఈ మొత్తాన్ని జమ చేసి భారత్‌కు పంపించారు.

దండారీ వేడుకలు



దండారీ వేషధారణలో ఆదివాసీ యువత

కడెం: మండలంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామంలో దండారీ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తమ ఆరాధ్యదైవం ఏత్మాసూర్‌కు పూజలు నిర్వహించి.. గుస్సాడీ టోపీలు ధరించి సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు.

స్టార్టర్లు చోరీ

కుంటాల: కుంటాల శివారు ప్రాంతంలో సోమవారం రాత్రి నాగులపెల్లి రామారావు వ్యవసాయ క్షేత్రంలో రెండు స్టార్టర్లు, సోలార్ పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.24 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. మంగళవారం రైతు కుమారుడు ప్రణయ్‌రావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పన్నులు వసూలు చేయాలి

తానూరు: గ్రామాల్లో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలని పేర్కొన్నారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో నసీరుద్దీన్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, ఆయా గ్రామాల కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

భైంసారూరల్: మండలంలోని పెండ్‌పెల్లిలో మంగళవారం ధన్వంతరి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వంతరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణుల ఓబీసీ జిల్లా కన్వీనర్ రవీందర్, సాయినాథ్, భోజన్న, శేఖర్, అనిల్ తదితరులు ఉన్నారు.

నర్సరీల్లో పూలు, ఔషధ మొక్కలు పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: మండలంలోని నర్సరీల్లో పూల మొక్కలు, ఔషధ మొక్కలు పెంచాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎంపీఓ అమీర్ ఖాన్, ఏపీఓ ప్రమీల, టీఏలు దినేశ్, భీమ్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దందాపై తనిఖీలేవి?

- నిబంధనలు పాటించని దుకాణదారులు
- క్షేత్రస్థాయిలో పరిశీలించని అధికారులు

భైంసాటౌన్: దీపావళి పండుగ వచ్చేసింది. చిన్నా పెద్దా ఉత్సాహంగా బాణసంచా కాలుస్తారు. దీంతో టపాసులకు భలే గిరాకీ ఉంటుంది. పట్టణంలో భైంసా నుంచి నిర్మల్ వెళ్లే మార్గంలో టపాసుల స్టాళ్ల ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్ల ఏర్పాటుకు పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, రెవెన్యూ, తదితర ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందాలి. సదరు అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్వాహకులు నిబంధనలు పాటిస్తేనే అనుమతులు జారీ చేయాలి. కానీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అనుమతులు జారీ చేస్తున్నారు. ఏటా టపాసుల స్టాళ్ల ఏర్పాటులో నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. ఏటా ఇదేతంతు కొనసాగుతోంది.

ఒకవేళ ప్రమాదం జరిగితే నష్టనివారణ చర్యలు చేపట్టే బదులు.. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. హైదరాబాద్‌లో రెండురోజుల కిందట టపాసుల దుకాణాల్లో భారీ అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే.

అనుమతుల పేరిట వసూలు..

ఇదిలా ఉండగా టపాసుల దుకాణాల ఏర్పాటుకు ఆయా శాఖల నుంచి అనుమతులు పొందడం ప్రయాసతో కూడుకుంది. దీంతో ఈ దందాలో ఒకరే అన్ని తానై వ్యవహరిస్తున్నారు. ఆయా శాఖల నుంచి అనుమతులతోపాటు స్టాళ్ల ఏర్పాటు కోసమని డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. 25 స్టాళ్ల ఏర్పాటుకు ఒక్కొక్కరి నుంచి రూ.23వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే దుకాణాల ఏర్పాటుకు డబ్బులు వసూలు చేసిన నేపథ్యంలో కొందరు వ్యాపారులు టపాసులను అధిక ధరలకు విక్రయించే అవకాశముంది. ఫలితంగా వినియోగదారులపై భారం పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



భైంసాలో ఏర్పాటు చేసిన టపాసుల స్టాళ్లు

నిబంధనలు పాటించేలా చర్యలు

టపాసుల దుకాణాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నారు.. నిబంధనలు పాటించేలా అన్ని చర్యలు తీసుకుంటాం. తుది అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.

– కోమల్‌రెడ్డి, ఆర్డీఓ, భైంసా

‘సంఘాలకు అతీతంగా మద్దతివ్వండి’



సిబ్బందితో మాట్లాడుతున్న కృష్ణారావు

సారంగపూర్: వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా సంఘాలకు అతీతంగా తనకు మద్దతివ్వాలని ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని జామ్‌లో ఉన్న సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయం, కేజీబీవీ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల ఫలితంగానే గ్రాట్యుటీ, కుటుంబ పెన్షన్ సాధించామని పేర్కొన్నారు. ఓటు ద్వారానే పాతపెన్షన్ విధానం సాధిద్దామని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వందో రోజుకు చేరిన దీక్షలు



దీక్షలో కూర్చున్న నాయకులు, రైతులు

దిలావర్‌పూర్: మండల కేంద్రమైన దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో తమ గ్రామాలు నాశనం అవుతాయంటూ మండలంలోని అనేక గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రారంభమైన దీక్షలు మంగళవారం నాటికి 100వ రోజుకు చేరాయి. ఫ్యాక్టరీని తరలించాలంటూ వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రాచీన శ్రీ కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లి.. ఫ్యాక్టరీని తరలించాలని మొక్కుకున్నారు. అనంతరం రాత్రి గ్రామంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. దీక్షా శిబిరంలో ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ గ్రామసభలు



కల్లూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో లింబాద్రి

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామంలో మంగళవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా 2025–26లో చేపట్టే ఉపాధి పనులు గుర్తించి ప్రణాళికలు తయారు చేశారు. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ మురికి కాల్వలు, పంటకాల్వలు, మట్టిపనులు, చెరువులో పూడికతీత పనులు చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. కార్యక్రమంలో టీఏ శారద, ఎఫ్ఏ పోశెట్టి ఉన్నారు.

కుంటాల: జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలికి పని కల్పిస్తామని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. మండలంలోని కల్లూరులో మంగళవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2025–26లో చేపట్టే పనులపై చర్చించారు. ఏపీవో గట్టుపల్లి నవీన్, టీఏ జైసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



కడెం: పాండ్వపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

కడెం: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంట విక్రయించి మద్దతు ధర పొందాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండుకూర్, పాండ్వాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు సన్నరకాలకు రూ.500 బోనస్‌ను త్వరలో రైతులకు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం కొండుకూర్‌లో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, రమేశ్‌రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌వర్మ, మండలాధ్యక్షుడు మల్లేష్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, బొడ్డు గంగన్న, నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, భూషణ్, రమేశ్, శంకర్, భూమన్న, సీఈఓ రాజేందర్ అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుతోపాటు సత్తనపల్లి పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ఇప్ప సత్యనారాయణ రెడ్డి, అమంద శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నాయకులు రమేశ్, రాజలింగం, రాజు, రాజేశ్వర్, రాజన్న, సీఈవోలు అశన్న, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం సందర్శన

భైంసారూరల్: మండలంలోని మాటేగాంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి సందర్శించారు. మంగళవారం కొనుగోలు కేంద్రంలోని సోయా బస్తాల నిల్వలు పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని సూచించారు. వారి వెంట అసిస్టెంట్ రిజిస్టర్ జగదీశ్, సీఈవో రాజేందర్ తదితరులు ఉన్నారు.

నగర్‌లో..

లోకేశ్వరం: మండలంలోని నగర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లోకేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కిశోర్, సాయన్న, భోజన్న ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరం ఉండాలి

లక్ష్మణచాంద: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరం ఉండాలని ఎస్సై సుమలత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాంటీ డ్రగ్స్, మాదక ద్రవ్యాల నిషేధంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తే జ్ఞాపకశక్తి తగ్గిపోతుందన్నారు. మెదడు పనిచేయకుండా మారి.. జంతువుల మాదిరి ప్రవర్తిస్తారన్నారు. ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ క్లబ్బులను ఏర్పాటు చేయాలని ఎస్సై సూచించారు. పరిసరాల్లో అనుమానితులు కన్పిస్తే 1908కు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజునాయక్, ఉపాధ్యాయులు గంగాసురేశ్, సుదర్శన్, రమేశ్‌గౌడ్, హరిప్రసాద్, అశోక్, సురేశ్‌బాబు, వినోద్‌కుమార్, హంసలత, నారాయణవర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలి



మాట్లాడుతున్న అధికారి

కుభీర్: ప్రతిఒక్కరూ బీమా చేయించుకొని ధీమాగా ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సురక్షా బీమా, జీవన్‌జ్యోతి, అటల్ పెన్షన్ యోజన పథకాల్లో చేరాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రీమియం బ్యాంకుల్లో లేదా పోస్టాఫీసుల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. అంతకుమందు జిల్లా పరిశ్రమల అధికారి నర్సింహారెడ్డి విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. సమావేశంలో డీఎల్‌పీవో సుదర్శన్‌పటేల్, ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



తానూరు: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో



మస్కాపూర్‌లో నీటిని పారబోయిస్తున్న సిబ్బంది

తానూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు.. మంగళవారం మండలంలోని హిప్నెల్లి గ్రామంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నిల్వనీటిని పారబోయించారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించి చిన్నారుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దత్తారెడ్డి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని బిలోలి గ్రామాన్ని ఎంపీడీవో సందర్శించారు. పంచాయతీలో రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. పల్లె ప్రకృతివనంలో పిచ్చిమొక్కలు లేకుండా చూడాలన్నారు. వారి వెంట కార్యదర్శి ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో మంగళవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించి నిలవ్వనీటిని పారబోయించారు. పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్, ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి

నర్సాపూర్(జి): నీటి వృథాను అరికట్టి పొదుపుగా వాడాలని డీఎల్‌పీవో రమేశ్ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని చాక్‌పల్లి, తురాటి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా పంచాయతీ రికార్డులు తనిఖీ చేసి శ్మశానవాటిక, సెగ్రిగేషన్‌షెడ్డు, పల్లె ప్రకృతి వనాలు పరిశీలించారు. చాక్‌పల్లి పంచాయతీలోని డొంగుర్గాంలో గ్రామస్తులకు నీటిని వృథా చేయవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు నరేశ్‌కుమార్, రాజు ఉన్నారు.

ఖానాపూర్: పరిసరాల పరిశుభ్రతలో భాగంగా మంగళ, శుక్రవారం నిర్వహించే డ్రైడేను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్‌లో డ్రైడేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం దిలావార్‌పూర్‌లో పంచాయతీ సిబ్బందికి డీపీవో కార్యాలయం నుంచి వచ్చిన దుస్తులు, సబ్బులు, షాంపు, కొబ్బరినూనె, డెటల్ తదితర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కల్పన, దివ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మోతాదుకు మించి ఎరువులతో అనర్థం



కార్యక్రమంలో పాల్గొన్న డీఏవో అంజిప్రసాద్

కుంటాల: రబీ సాగులో మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం అనర్థమేనని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, హైదరాబాద్ రాజేంద్రనగర్ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త నగేశ్ అన్నారు. రైతునేస్తంలో భాగంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడారు. మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలని సూచించారు. కుంటాల రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఏవో అంజి ప్రసాద్, ఏఈవోలు గణేశ్, హర్షిత, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కరపత్రం ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లో వచ్చే నెల 4న నిర్వహించే మీసేవ ఆవిర్భావ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో మీసేవల యజమానులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మీసేవల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెరుగు పవన్‌కుమార్, రాష్ట్ర మీడియా ప్రతినిధి వేణుగోపాల్, జలాల్, కొప్పుల కరుణాకర్, జీశాన్, సాయికుమార్, అలీం తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎల్లపల్లి డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాలలోని పేద విద్యార్థులకు ఎంఐఎం నాయకులు మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. వారికి అవసరమయ్యే పలకలు, విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు అబ్రార్, హుస్సేన్, ఇర్ఫాన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు

కుంటాల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అందాకూర్‌లో బీజేపీ నాయకులు మంగళవారం అర్హులైన పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని మండల కన్వీనర్ సాయి సూర్యవంశీ కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్, రాఘవేందర్, మల్లేశ్, వెంకటేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోపూజ మహోత్సవం

ఖానాపూర్: గోవత్స ద్వాదశిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గోపూజ మహోత్సవం నిర్వహించారు. అర్చకుడు నిమ్మగడ్డ సందీప్‌శర్మ ఆధ్వర్యంలో గోవులను వస్త్రాలు, పూలతో అలంకరించి గోప్రదక్షిణ నిర్వహించారు. గోవు సంరక్షణతో కలిగే ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజన్న, భక్తులు ఉన్నారు.

సన్మానం

భైంసాటౌన్: భైంసా ఏఎంసీ చైర్మన్ సింధే ఆనంద్‌రావు పటేల్, వైస్‌చైర్మన్ ఆసిఫ్‌తోపాటు డైరెక్టర్ తోట రామును పలువురు సన్మానించారు. పట్టణంలోని ఏఎంసీ చైర్మన్ కార్యాలయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పి.కృష్ణ, బీజేపీ నాయకులు గాలి రవి తదితరులు శాలువా, పూలమాలతో సత్కరించారు. మాజీ జెడ్పీటీసీ సూర్యకాంతరావు, మున్నూరు కాపు సంఘం నాయకులు చొండి రాజేశ్వర్, రాందాస్, ఆర్‌ఎంపీ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు మోహన్ ఏఎంసీ చైర్మన్‌ను సత్కరించారు.

‘రూ.10 నాణెం చెల్లుబాటుపై అనుమానాలు వద్దు’

ఖానాపూర్: రూ.10 నాణెం చెల్లుబాటుపై వ్యాపారులు, ప్రజలు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని తిమ్మాపూర్ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ ఇ.విజయ్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రూ.10 నాణేలు చెల్లుబాటు కావడం లేదని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని.. ప్రతి ఒక్కరూ ప్రజల వద్ద రూ.10 నాణెం తీసుకోవాలన్నారు. నాణేలు చెల్లుబాటు కావడం లేదని దుష్ప్రచారం చేసినా.. తిరస్కరించినా చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారని పేర్కొన్నారు. సమావేశంలో సిబ్బంది ప్రజ్యోత్, అఖీబ్ తదితరులు ఉన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

ముధోల్: మండలంలోని తరోడాలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి రవీందర్‌యాదవ్ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. నవంబర్ 14 వరకు శిబిరం ఉంటుందని.. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పశువైద్యాధికారి బలిక్ అహ్మద్, సిబ్బంది ఉన్నారు.

ప్లాట్లు పరిశీలన

కుంటాల: ఎల్ఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరిస్తామని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. మండలంలోని కల్లూరులో మంగళవారం ప్లాట్లను పరిశీలించారు. ఎంపీవో ఎంఏ రహీంఖాన్, కార్యదర్శి భోజన్న ఉన్నారు.

రోడ్డు కోసం ఆందోళన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సోన్: తమ గ్రామానికి సర్వీస్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని కడ్తాల్‌లో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గ్రామంలో ఫ్లైఓవర్ నిర్మించి సర్వీస్ రోడ్డు లేకుండా రహదారి ఏర్పాటు చేశారని వాపోయారు. గతంలో ఉన్న సర్వీస్‌రోడ్డును రహదారిలో కలపడంతో గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి అధికారులు గతంలో మాదిరి సర్వీస్ రోడ్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

20ఎంఎల్@రూ.200

- ముధోల్‌లో జోరుగా గాడిదపాల విక్రయం



గాడిద పాలు పిండుతున్న వ్యక్తి

ముధోల్: మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా అస్నెల్లికి చెందిన మధు ముధోల్‌లో ఆదివారం నుంచి గాడిదపాలు విక్రయిస్తున్నాడు. మంగళవారం తన రెండు గాడిదలతో వీధుల్లో తిరుగుతూ మైకుల ద్వారా ప్రచారం చేసుకుంటూ 20 ఎంఎల్ గాడిద పాలను రూ.200కు విక్రయిస్తున్నాడు. ఈ పాలు తాగితే చిన్నారులు దమ్ము, దగ్గు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని మధు పేర్కొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

కడెం: కలెక్టర్ ఆదేశాల మేరకు టీచర్ ఎమ్మెల్సీ ఓటును ఉపాధ్యాయులంతా నమోదు చేసుకోవాలని కడెం కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్ నాయక్, ఎస్‌వో విమల, సీఆర్పీ రాజేశ్వర్ ఉన్నారు.